తన మాటల్లో, చేతల్లో వైరుధ్యం పెరియార్‌కే తెలుసు. ఓ సారి ఒక స్నేహితుడు అడిగాడు – "భగవద్గీతను అంత తిడుతున్నావు కదా. అది చెప్పినవాడు గొల్లవాడు. విన్నది క్షత్రియుడు. దాన్నంతా గ్రంథస్తం చేసినది ఓ గొఱ్ఱెలు కాచుకునేవాడు.(!?). దీనిలో బ్రాహ్మడు ఎక్కడున్నాడు? నువ్వు వాళ్లనెందుకు తిడుతున్నావ్?" అని. "నేను చెప్పేది నీ లాటి మేధావులకు కాదు, సామాన్యులకు మాత్రమే. వాళ్లు యీ ఘనతంతా బ్రాహ్మలకే కట్టబెడుతున్నారు. అందుకని.." అన్నాట్ట పెరియార్. నిజానికి పెరియార్ ఉద్యమం వలన తమిళనాడులో దైవభక్తి అంతరించిందా అంటే లేదనే చెప్పాలి. మరింత పెరిగింది. బ్రాహ్మణుల ఆధ్వర్యంలో నడిచే గుడులు, గోపురాలు ఒక పక్క ఎప్పటిలాగా ప్రజలను ఆకర్షిస్తూండగా, మరో పక్క వెనుకబడిన, దళిత జాతుల నుండి గ్రామదేవతలు ప్రాచుర్యంలోకి వచ్చారు. ఎల్లమ్మ, కరుమారియమ్మ (రేణుకాదేవి) వంటి గ్రామదేవతలకు ఆదరణ పెరిగింది. అంతేకాదు, ఆదిపరాశక్తి ఉద్యమం వంటివి కొత్తగా పుట్టుకుని వచ్చాయి. బంగారు అడిగళ్ వంటి వెనుకబడిన కులాలవారు దైవాంశ సంభూతులుగా (గాడ్‌మెన్) అవతరించారు. పెరియార్ నాస్తికోద్యమం ఎక్కడికి పోయిందో దేవుడికే తెలియాలి.



గట్టిగా మాట్లాడితే పెరియారే కొత్త దేవుడిగా వెలిశాడు. అతని భక్తుల్లో యిప్పటికీ వున్న అగ్రేసరుడు కె వీరమణి. అతను మీటింగుకి వుందంటే ఆడవాళ్లు నగరవీధుల్లో దీపకళికలు, హారతులు పట్టుకుని నడుస్తారు. మగవాళ్లు వీపుల్లో కొక్కాలు గుచ్చుకుని (భక్తులు యిలా కొక్కాలు గుచ్చుకుని దేవుడి రథాన్ని లాగే సంప్రదాయం తమిళనాడులో వుంది) రథాన్ని లాగుతారు. తేడా అల్లా ఏమిటంటే గతంలో దేవుడి బొమ్మ వుండేది, యిప్పుడు పెరియార్ బొమ్మో, వీరమణి బొమ్మో వుంటుంది. పెరియార్ ఒక్కడే కాదు, ఆయన శిష్యప్రశిష్యులైన ద్రవిడ నాయకులు (అణ్నా, కరుణానిధి, ఎమ్జీయార్, జయలలిత, స్టాలిన్, అళగిరి) అందరూ కూడా కొత్త దేవుళ్లయి కూర్చున్నారు. గతంలో గుడి గోపురాలుంటే యిప్పుడు చెక్క కటౌట్లున్నాయి. అతిశయంగా అనిపించే లార్జర్-దాన్-లైఫ్ కటౌట్లు నుండి ఆ నాయకులు కింద పిపీలకాల్లా వుండే కార్యకర్తలను చూస్తుంటారు. దేవుడిలాగే వీళ్లు పైన ఎక్కడో వుంటారు. ఈ కార్యకర్తలు దైవభక్తుల లాగే నాయకుల కాళ్లమీద సాష్టాంగపడతారు. తమ నాయకుడి ఆరోగ్యం గురించి ఉపవాసాలుంటారు. నోములు నోస్తారు. ఓ పూట జైలుకి వెళితే ఆత్మహత్యలు చేసుకుంటారు. అంటే అర్థమేమిటి? అదే దైవపూజ సాగుతోంది. నాయకులే దేవుళ్లయ్యారన్నమాట.

బ్రాహ్మణులను యింత తిడుతూ వుంటే, వాళ్ల పిలకలు కత్తిరిస్తూ వుంటే, జందాలు తెంపుతూ వుంటే, గుడిలోకి వెళ్లకుండా తరుముతూంటే వాళ్లేం చేశారు అన్న ప్రశ్న వస్తుంది. ఏమీ చేయలేదు. తిరగబడలేదు. తిట్టుకుంటూ కూర్చున్నారు. పత్రికల్లో వ్యాసాలు రాసుకున్నారు. బిసిలు పెరియార్‌ని మానవదేవుణ్ని చేశారు కాబట్టి తామూ ఒక మానవదేవుణ్ని వెతుక్కున్నారు. ఆయన కంచి కామకోటి పీఠాధిపతి చంద్రశేఖర సరస్వతి. ఆదిశంకరుడు స్థాపించిన పీఠాలలో కంచి పీఠం లేదు. దక్షిణాదిన శృంగేరి మాత్రమే వుంది. కానీ అది కర్ణాటకలో వుంది. అందువలన తమిళనాడులో వున్న కంచిపీఠానికే తమిళ బ్రాహ్మణులు పట్టం కట్టారు. అన్ని రాష్ట్రాలలోనూ చిన్నవో, పెద్దవో పీఠాలు వుంటాయి. పీఠాధిపతులు సాధారణంగా పండితులు, అందరి చేత గౌరవించబడేవారే వుంటారు. అయితే కంచి పీఠం విషయంలో ఆయన్ను ఆకాశమంత ఎత్తుకు పెంచేశారు. ఆయనకు 'నడిచే దేవుడు' అని బిరుదు నిచ్చేసి, ఆ పేరుతోనే వ్యవహరించారు. నిజానికి ఎంత దైవాంశ వున్నా మనిషి మనిషే కదా. దేవుడెలా అవుతాడు? అయినా వీళ్లు ఆయన గురించి అలాగే ప్రచారం చేశారు. అనేకమంది అబ్రాహ్మణులు కూడా ఆయన అనుయాయులయ్యారు. కంచి కామకోటి పీఠం ఆస్తుల్లో, ఆధిపత్యంలో శృంగేరికి పోటీగా తయారైంది. చంద్రశేఖర సరస్వతి (పెద్ద స్వాములారు) గౌరవంగానే వెళ్లిపోయినా, ఆయన శిష్యుడు, ప్రస్తుత పీఠాధిపతి జయేంద్ర సరస్వతి హత్య కేసుతో సహా అన్ని రకాల గొడవల్లోనూ యిరుక్కున్నారు. పెరియార్ విషయంలో జరిగినట్టే మనుష్యులను దేవుడి స్థాయికి తీసుకెళితే జరిగేది యిదే !



ఇక పెరియార్ ద్రవిడ జాతి సిద్ధాంతం – ఇది ఇంగ్లీషు వారి తెలివితేటలు. భారతీయ సమాజాన్ని ఖండఖండాలుగా చేసి వాళ్లు చూశారు. ఫలానా రాజు తర్వాత ఫలానా రాజు వచ్చాడని రాస్తే అదో అందం. అలాకాకుండా ముస్లిం కింగ్స్ అనీ హిందూ కింగ్స్ అనీ చరిత్రను విడగొట్టి ఆ కళ్లతో చూశారు. తమిళనాడు దగ్గరకి వచ్చేసరికి ఆర్య-ద్రవిడ విభేదాలు తెచ్చారు. హిందూ సమాజాన్ని ఎంత విడగొడితే క్రైస్తవానికి అంత లాభం. అందుకే రెవరెండ్ రాబర్ట్ కాల్డ్‌వెల్ ద్రవిడులపై ఆర్యుల దాడి సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. తమిళదేశంలో ముందునుండీ వున్నది శూద్రులైన తమిళులనీ, బ్రాహ్మణుల ఉత్తరభారతంనుండి వచ్చి వీళ్లని బానిసలుగా చేసుకున్న ఆర్యులనీ, వాళ్ల భాషయైన సంస్కృతాన్ని తమిళంపై రుద్దుతున్నారనీ ప్రతిపాదించి, ప్రచారం చేశాడు.

ఆకారంబట్టి గాని, రూపురేఖల బట్టిగాని, వేషభాషల బట్టిగాని తమిళ బ్రాహ్మణులకు, తమిళ అబ్రాహ్మణులకు తేడా ఏమీ కనబడదు. తేడా ఏమైనా వుందా అంటే చదువుకున్నవారికీ, చదువుకున్నవారికీ వుండే తేడా లాటిదే. కొన్ని కొన్ని పదాలు యితరులు వాడనివి, తమిళ బ్రాహ్మణులు వాడతారు. (ఈ తేడా తెలుగు బ్రాహ్మణ, బ్రాహ్మణేతరుల్లో లేదు) ఆ మాత్రం తేడా పట్టుకుని వీళ్లు ఎక్కణ్నుంచో దిగి వచ్చారంటే ఫన్నీగా వుంటుంది. పోనీ వాళ్లకంటూ ప్రత్యేకమైన భాష ఏదైనా వుందా అంటే అదీ లేదు. యాసలో కాస్త తేడా తప్ప !

నిజానికి భాషావేత్తలు చెప్పేదేమిటంటే అన్ని భాషలకు మూలమైనది బ్రాహ్మీ భాష, బ్రాహ్మీ లిపి. దానిలోనే ప్రాంతీయ భేదాలున్నాయి. ఒక్కో ప్రాంతంలో వాడుకలో వున్న మాటలన్నీ చేర్చి సంస్కరించి, ఒక సాధుభాష (రిఫార్మ్‌డ్ లాంగ్వేజ్) తయారుచేశారు. దేశమంతా పండితులు అదే వాడదామని అనుకున్నారు. ఈ పని చేయడానికి ముందు, వెనకా వున్న భాషలను మనం గుర్తించవచ్చు. పని అంటే కృతము, చేయబడినది. సంస్కరణ పని చేయడానికి ముందున్న భాష ప్రా(ఇంగ్లీషులో 'ప్రి' అన్నట్టు)–కృతము. పని చేసిన తర్వాత తయారైన భాష సమ్స్–కృతము (బాగుగా చేయబడినది, రిఫార్మ్‌డ్). పండితులు సంస్కృతం మాట్లాడితే తక్కినవారు ప్రాకృతం మాట్లాడేవారు. సంస్కృత నాటకాలలో కూడా నాయికా నాయకులు సంస్కృతంలో సంభాషణలు చెపితే నేటివిటీ కోసం నౌకరు పాత్రలు ప్రాకృతం మాట్లాడేవి. (సశేషం) – **ఎమ్బీయస్ ప్రసాద్ (నవంబరు 2011)**